

ఉపాధ్యాయుల బదిలీలు!
ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసింది. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి జడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయులు కె.గోపీనాథ్, చిన్నతిప్పసముద్రం జడ్పీ పాఠశాల సిటిఎం బదిలీ చేసింది. ఈయన స్థానానికి చిన్నతిప్పసముద్రం జడ్పీ పాఠశాల సిటిఎం గణిత ఉపాధ్యాయుడు డి.సుధాకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నాగవరం జడ్పీ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు భరణి తిరుపతి జిల్లాలోని ఎంఆర్‌పల్లి జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. టి.సుండుపల్లి మండల జడ్పీ పాఠశాల స్కూల్‌అసిస్టెంట్ పిఎస్ పి.ఉమ, కడప జయనగర్ కాలనీలోని జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. సంబేపల్లి ఎపి మోడల్ స్కూల్ పి.యోగీశ్వరరెడ్డి(టిజిటి) అనంతపురం జిల్లా గార్లదిన్నెలోని ఎపి మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.చిన్నవెంకట సుబ్బయ్య (తెలుగుఎస్ఎ) కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం దొర సానిపల్లి జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. చాపాడు మండలం నరసింహాపురం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు టి.డోర్నాక యూనిస్, కడప మండలం జయనగర్ కాలనీ జడ్పీ బాలికల హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం జేమ్స్‌పేట ఎంపిపి స్కూల్ నుంచి రాజురామచంద్రరావు (పిఎస్‌హెచ్‌ఎం) గంగాభవంతి నగర్ ఎంపిపి స్కూల్‌కు బదిలీ కావడం గమనార్హం.

'ఉక్కు' నిర్మాణంపై మోడీ నోరు విప్పాలి
– నిరసనలో వామపక్ష నాయకుల డిమాండ్
ప్రజాశక్తి- కడప అర్బన్

మోడీ 8 ఏళ్ల పాలన, ప్రత్యేక హోదాపై ప్రశ్నించని ముఖ్యమంత్రి జగన్‌పై ఏపీ ప్రజల పోరాడాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై మోడీ నోరు విప్పాలని సిపిఎం సిపిఐ జిల్లా నగర కార్యదర్శులు జి. చంద్రశేఖర్, వెంకట శివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం విశాఖ పట్నం వస్తున్న సందర్భంగా రాష్ట్రానికి పార్లమెంటు చేసిన ప్రత్యేక హోదా చట్టాన్ని అమలు చేయని కారణంగా 'మోడీ గో బ్యాక్' నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం కడప జిల్లా సీనియర్ నాయకులు బి.నారాయణ, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తి, ఎల్.నాగ సుబ్బారెడ్డి, సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ కడప నగర కార్యదర్శి వెంకట శివ ఈ కార్యక్రమానికి హాజరు య్యారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి, మెజార్టీ ఎంపీ సీట్లు రాష్ట్ర ప్రజలు ఇస్తే కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని నమ్మబలికి 29 ఎంపీ సీట్లు ప్రజల నుంచి తీసుకున్నారని చెప్పారు. గెలిచాక నరేంద్ర మోడీ ఆడమన్నట్లుగా ఆడుతున్నారే గాని కనీసం ప్రశ్నించలేక పోతున్నారని తెలిపారు. పార్లమెంటు చట్టాలను రాజకీయ విలువలను బిజెపి, మోడీ, కేంద్ర ప్రభుత్వం మంట కలుపుతున్న జగన్ పళ్ళంతా మాట కూడా పలక లేకున్నారన్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రజల ందరూ నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ రాష్ట్రమంతా నినాదాలు చేస్తుంటే జగన్ విశాఖపట్నంలో మోడీతో సభలు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. సిపిఐ కడప నగర కార్యదర్శి వెంకట శివ మాట్లాడుతూ బిజెపి మోడీ పరిపాలనపై రాష్ట్ర ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో మండిపోతూ ఉంటే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం పై మాట్లాడకుండా రాష్ట్రంలో పర్యటించడానికి జగన్ గారు దగ్గరుండి స్వాగతం పలకడం హేయమైన చర్య అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.నారాయణ గారు మాట్లాడుతూ నరేంద్ర మోడీకి ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టే నైతిక అర్హత కోల్పోయారని విమర్శించారు. సిపిఐ సీనియర్ నాయకులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, కార్యక్రమంలో పి.కృష్ణ మూర్తి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మనోహర్, కె.శ్రీని వాసులరెడ్డి, ఎం.పాపిరెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు వేణు గోపాల్, మద్దిలేటి, మనోహర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి సిపిఎం సిపిఐ వామపక్షాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. **సిఐటియు, ఎఐటి యుసి ఆధ్వర్యంలో..** విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రవేట్ పరం చేయాలని నిర్ణయి ంచిన మోడీ గో బ్యాక్ అంటూ సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి నినదించారు. శుక్రవారం పాత బస్టాండ్ లోని మోడీ పర్యటన వ్యతిరేకిస్తూ మట్టి చేత పూని నిరసన వ్యక్తం చేశారు కార్యక్రమంలో మద్దిలేటి, సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్ర మంలో సిపిఎం మండల నగర కార్యదర్శి బైరవప్రసాద్, సిపిఎం పోరుమామిళ్ల మండల కమిటీ సభ్యులు వరలక్ష్మి, శ్రీని వాసులు బీబీ, లూరు మేరి, కుసులూరి రవి, కడుగు ప్రసాద్, లక్షుమ్మ, రామ తులసి, రత్నమయ్య పాల్గొన్నారు. **బద్వేల్ :** సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నల్ల బెలూన్స్, ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శీను, నాయకులు కె.బాబు, పి. చాంద్ బాషా, ఇరగ దిండ్ల రమ ణయ్య, గిలకరాజు, అనంతమ్మ, మస్తాన్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్న, చిన్నయ్య, గంపా సుబ్బారాయుడు, పెద్ద ఓబయ్య, ఆటో యూనియన్ నాయకులు, నరసింహ, హరి, శ్యామ్, జయరామయ్య పాల్గొన్నారు.



కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నల్ల జెండాలతో నిరసన తెలియజేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రవీణ్‌కు బెయిల్
ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరైంది. గత నెల నాలుగవ వారంలో ప్రొద్దుటూరు పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలి సమీప బంధువు పట్టణంలోని పలువురి డ్వాక్రా సభ్యుల నగదును స్వాహా చేశారనే ఆరోపణలపై చెలరేగిన వైసిపి, టిడిపి కార్యకర్తల రాళ్లదాడి ఘటన చోటు చేసుకుంది. ఈ ఘర్షణ కేసులో పోలీసులు టిడిపి నేత ప్రవీణ్‌ను అర్ధరాత్రి అరెస్టు చేసి ఉదయాన్నే కోర్టుకు హాజరుపరిచి కడప సెంట్రల్ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. రెండ్రోజుల అనంతరం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కడప సెంట్రల్ జైలులో ఉన్న టిడిపి నేతలను పరామర్శించారు. అనంతరం ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం హైకోర్టు విచారణ అనంతరం ఆయనతోపాటు మరో ఆరుగురు అనుచరులకు షరుతులతో కూడిన బెయిల్ ఇచ్చినట్లు సమాచారం. రెండు వారాలపాటు ఎక్కడా ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయొద్దని కండీషన్ బెయిల్ ద్వారా ఆదేశించినట్లు తెలిసింది. ఉక్కు ప్రవీణ్ అనుచరులు, సన్నిహితులు, పార్టీ కేడర్‌లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పలువురు సిఐలకు స్థాన చలనం
ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో పలువురు సిఐలను బదిలీ చేస్తూ కర్నూలు కర్నూల్ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. పోరుమామిళ్ల సిఐ రమేష్ బాబును కడప విఆర్‌కు, కలకడ సిఐగా ఉన్న సురేష్ రెడ్డి పోరుమామిళ్ల సిఐగా బదిలీ చేశారు. కడప రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా ఉన్న శ్రీరామ శ్రీనివాసులును కడప విఆర్‌కు బదిలీ అయ్యారు. చిన్నచౌక్ సిఐగా ఉన్న అశోక్ రెడ్డి కడప రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా బదిలీ చేశారు. వేంపల్లి సిఐ సీతారామరెడ్డిని కడప విఆర్‌కు బదిలీ చేశారు. జమ్మలమడుగు సిఐ వెంకటేశ్వర్లును వేంపల్లి సిఐగా, ఒంటిమిట్ట సిఐ రాజా ప్రభాకర్‌ను కడప విఆర్‌కు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా విఆర్‌లో ఉన్న పురుషోత్తం రాజును ఒంటిమిట్ట సిఐగా నియమించారు. తిరుపతి విఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును పులివెందుల ట్రాఫిక్ సిఐగా నియమించారు. ఇప్పటికే రిమ్స్ సిఐగా ఉన్న సదాశివయ్య జమ్మలమడుగు అర్బన్ సిఐగా, జమ్మలమడుగు సిఐ వెంకటేశ్వర్లు వేంపల్లి సిఐగా బాధ్యతలు స్వీకరించారు. కడప ఎస్‌బిలో ఉన్న సిఐ రామచంద్ర రిమ్స్ సిఐ గా బాధ్యతలు చేపట్టారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం : కలెక్టర్


సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

అందరూ విద్యావంతులైతేనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, విద్యతోనే పేదరికాన్ని దూరం చేయగలమని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి వేడుక, జాతీయ విద్యాదినోత్సవ కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులం, మతం, వర్గం ఇవేవీ విద్యకు ప్రమాణికాలు కావన్నారు. విద్యను ఎవరు దొంగలించలేరని, ప్రతి ఒక్కరూ ఇష్టంగా విద్యను అభ్యసించాలన్నారు. భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారత రత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని స్వతంత్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన మదరసా విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. చివరగా మదరసా నిర్వాహ కులను, విద్య, ఉద్యోగ, వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగిన పలువురు ముస్లిం మైనారిటీలను కలెక్టర్ సత్కరించారు. విద్యార్థులకు మెమోంటోలను ప్రదానం చేశారు. కార్యక్ర మానికి శిక్షణా డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కృష్ణకిషోర్ , వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం డీఈవో దేవరాజు, సమగ్ర శిక్ష పీడి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు షఫీ, జఫరుల్లా, జమాల్ వలి, ముస్లిం మైనారిటీ పెద్దలు, పలువురు మైనారిటీ అధికారులు ,సంఘ సేవకులు, మదరసా నిర్వాహకులు, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో..** స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శనరెడ్డి సిఎస్ఎం విభాగాధిపతి పి.ఎ. రమేష్, ఇసిఇ విభాగ అధిపతి బి. ప్రవీణ్ కుమార్, సిఎస్‌సి విభాగాధిపతి జి. శ్రీనివాసులు, ఎస్. ఇలియాస్ అలీ, అధ్యాపక, అధ్యాపకేతర పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** బుల్ కలాం ఆజాద్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ముందుకు ఎదగాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) లో మలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ. నాగరాజు, పి. శివరామకృష్ణ, డాక్టర్ ఏ. సావిత్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవి శేఖర్,డాక్టర్ సి నరసింహ రావు, డాక్టర్ వీర నాగేంద్ర కుమార్, గయాజ్ తో పాటు కళాశాలలో ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతరులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** కాంగ్రెస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, నగర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, రాష్ట్ర నాయకుడు సత్తార్, ఆరిఫుల్ల, అలీ ఖాన్, అక్రమ్, సాదికలి, అలెక్స్ సురేష్, ఆనంద్, పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మూలవంక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కమలాపురం ఎంఎల్ఏ రవీంద్రనాథరెడ్డి హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్‌తోపాటు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతం ఉపాధ్యాయులు కె.వి. రమణారెడ్డి, రాణిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాధికా రాజగోపాల్ రెడ్డి, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీం, ఇన్‌ఛార్జి డిఇ కాశిం, మండల వైసీపీ నాయకులు గూడా ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్



మాట్లాడుతున్న ఎస్.వి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

అందరికీ ఆదర్శం భక్త కనకదాసు
ప్రజాశక్తి - కడప అర్బన్

తత్వవేత్త, కవి, సంగీత కారుడు, స్వరకర్త అయిన భక్త కనక దాసు అందరికీ ఆదర్శమని జిల్లా బీసీ సంక్షేమాధికారి, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ఇడి డాక్టర్ వి. బ్రహ్మయ్య కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా బీసి సంక్షేమ శాఖ కార్యాలయంలో భక్త కనకదాసు జయంత్యుత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన కనక దాసు కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవ చేశారన్నారు. కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కనకదాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి అమూల్యమైన సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో.. పసుపులేటి మనోజ్ కుమార్, కరువ కుల సంఘ నాయకులు చంద్ర, బాలశివ, ప్రసన్నకుమార్, బిసి.సంఘ నాయకులు, బిసి వెల్ఫేర్, బిసి కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'రూట' రాష్ట్ర సమావేశం
కడప అర్బన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయాలని రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ ఉర్దూ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ నగరంలోని షాహి దర్బార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం ఉర్దూ కాన్ఫరెన్స్, మధ్యాహ్నం రూట రాష్ట్ర శాఖ ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల అధికారిగా రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, ఎన్నికల పరిశీలకులుగా రూట సీనియర్ నాయకులు అబుబకర్ సాహెబ్ వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో రూట అసోసియేట్ అధ్యక్షులు షాహి దుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తార్ ఫైజి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, సయ్యద్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన
కడప : ఆశా రేఖ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నెమలిదిన నాగవేణి ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న పద్ధతిలో కడప నగరంలోని దొంగల చెరువు కట్ట హౌసింగ్ బోర్డు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు చరణ్ అనే చిన్నారి కోయదొర వేషధారణతో ముచ్చటగొలిపే పర్యావరణ హిత మాటలు చెప్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు శివారెడ్డి, జావీద్, అబ్దుల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన
కడప : బుడగ జంగం కాలనీలో రోడ్లు, కాల్వల పనులకు శుక్రవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మాసి మా బాబు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి, ఎం.బి. సి జిల్లా అధ్యక్షులు పస్తం అంజి మసీమబాబును సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఇ. రామచంద్రయ్య, స్థానిక నాయకులు కె. లక్ష్మమ్మయ్య, సి సయ్యన్న, డి. శంకర్, కె. కురుమయ్యే, సి.వెంకటయ్య, పి.ఆంజనేయులు, డి నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం దారుణం
ప్రజాశక్తి - కడప అర్బన్


సిఐటియు నాయకులతో మాట్లాడుతున్న సిఐ

మాసాపేటలో 70 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను నగర పాలక సంస్థ అధికారులు కూల్చివేయడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్య దర్శి మనోహర్ అన్నారు. శుక్రవారం ఇళ్లు కూల్చే ప్రాంతంలో నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు పారిశుధ్య పనులు , కూలి, నాలి చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నష్టపోయిన వారికి వేరే చోట స్థలం కానీ, ప్లాటు కానీ ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన అధికారులు లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేదని, ఆఫీసులు, ఫ్యాక్టరీ లు, హాస్పిటల్స్ లేవని పేర్కొన్నారు. పేదల ఇళ్లు కాబట్టి నిర్లక్షంగా కూల్చి వేస్తున్నారని విమర్శించారు. ఎంతో ట్రాఫిక్ ఉన్న 7రోడ్స్, గోకుల్ లాడ్జి, క్రిస్టియన్ లైన్ ప్రాంతాలను వదిలి పేదల ఇళ్లు కూల్చడం అధికారుల చేతకాని తనానికి నిదర్శనమన్నారు పేదలకు సీఐటీయూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేసేందుకు ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీని వాసులురెడ్డి, నాయకులు డి.ఎం. ఓబులేసు, మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు సుంకర రవి, సుంకర కిరణ్, ప్రకాష్ పాల్గొన్నారు. **పేదల ఇల్లు కూల్చడం దుర్మార్గం :** మాసాపేటలో చాలా కాలం నుంచి నివాసం ఉంటున్న ఇళ్లను నగర పాలక సంస్థ అధికారులు కూల్చివేయడం దుర్మార్గమని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మాసాపేటలో ప్రజలు కష్టం చేసుకుని నిర్మించుకున్న ఇళ్ళను కూల్చడం దారుణమని తెలిపారు. ఇల్లు కూల్చకముందే ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యం
కాశినాయన : మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించనున్నామని మండల వైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. శుక్రవారం కోడిగుడ్లపాడు, అనంవారిపల్లెల్లో కామన్ హెల్త్ వెల్నెస్ కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అందుబాటులో వైద్య సేవలు అందజేస్తున్నామని చెప్పారు. నడవలేని వారి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
చింతకొమ్మదిన్నె : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నామని అధికారి పి. ఇబ్రహీం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాటాడుతూ 14న జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 15న ప్రస్తక ప్రదర్శన, 17న 6,7,8 తరగతుల విద్యార్థులు చిత్రలేఖన పోటీలు, 18న 9,10 తరగతుల విద్యార్థులకు 'గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్
కడప : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎన్. సోలమన్ రాజు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తెలిపారు. ఈనెల 12న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 27 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని కోరారు.

రేపటి నుంచి తరగతులు ప్రారంభం
కడప : ప్రభుత్వ పురుషుల కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలోని డిగ్రీ విద్యార్థులకు ఈనెల 13 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. చెన్నకేశవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు మొదటి సెమిస్టర్ క్లాసులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడవ సెమిస్టర్ క్లాసులు, తృతీయ సంవత్సర విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ కు సంబంధించిన బోధనా తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రం ఆఫీస్ నందు సంప్రదించగలరని తెలిపారు.

మహిళలు జాగ్రత్తలు పాటించాలి
ప్రజాశక్తి- కడప సిటీ

కార్తీక మాసంలో ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి బసివిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దుర్గమ్మగుడి, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బాలాజీఆలయం, మృత్యుంజయ కుంట శివాలయం, నబి కోట శివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల మేనేజ్‌మెంట్‌కు, మహిళలకు దీపాలు వెలి గించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్ని ప్రమాద నిరోధక యంత్రాలను ఏర్పాటు చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో కడప అగ్నిమాపక సిబంది పాల్గొన్నారు.


సూచనలిస్తున్న అగ్నిమాపక సహాయ అధికారి బసివిరెడ్డి

వైద్య సేవలు పొందాలి : డిఎంహెచ్ఒ
ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

వైఎస్ఆర్ ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలు వైద్య సేవలు పొందాలని డిఎంహెచ్ఒ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం బుగ్గలేటి పల్లెలో 104 వాహనాన్ని తనిఖీ చేసి అనంతరం అక్కడున్న గ్రామస్తులతో మాట్లాడారు. 104 వాహనం షెడ్యూల్ ప్రకారం వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ ఫ్యామిలీ హెల్త్ సెంటర్‌ను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ఆయన తాడిగొట్లలో డెంగీ జ్వరంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ శైలజ, సూపర్‌వైజర్ షణ్ముగం, సిహెచ్ఒ సుకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

పంటలపై అవగాహన కల్పించాలి
ప్రజాశక్తి-చెన్నూరు

ప్రతి రైతుకూ రైతు భరోసా కేంద్రాల్లో ఆయా పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు రైతు భరోసా కేంద్రం-2 లో మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసి కాలువల్లో నీరున్నా పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. పండించే పంటకు గిట్టుబాటు ధర రావడంలేదని , పంట కూడా సరిగా రాకపోగా ఖర్చులు అధికంగా అవుతున్నాయనే భావనలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు చూపేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జిఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ జాన్ వెస్లీ, వ్యవసాయ అధికారి శ్రీదేవి, బయనపల్లి సర్పంచ్ చంద్రయాదవ్, నీలం వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం
ప్రజాశక్తి-కడప సిటీ



పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని, ఈనెల 13న శ్రీశివశంకర ఆస్పత్రిలో మెగా వైద్య శిబిరం నిర్వ హించనున్నట్లు ప్రముఖ వెన్నెముక, కీళ్లు, ఎముకలు, కండరాలు, నరాల వ్యాధి నివారణ నిపుణులు డాక్టర్ శివ బాబు గద్దె పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాటాడుతూ నగరంలోని శ్రీశివశంకర ఆస్పత్రిలో ఆదివారం దుయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. రూ. 4 వేలు విలువ చేసే బిఎండి, ఎన్‌డిఎస్ పరీక్షలు పూర్తి ఉచితంగా చేస్తామని చెప్పారు. ఎలాంటి ఫీజు తీసుకోకుండా వైద్య పరీక్షలు చేస్తామని రక్తపరీక్షలు, ఎక్స్‌రే, సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లలో 25 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా మధురెడ్డి నామినేషన్
ప్రజాశక్తి - కడప



ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రితం రెడ్డి సహకారంతో నామినేషన్‌ను వెన్నపూస మధు రెడ్డి దాఖలు చేశారు. ఆయనతో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, సురేష్, పాలగిరి శివ, బాబు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలసి టిడిపి నాయకులు
ప్రజాశక్తి- కడప అర్బన్


నారాలోకేష్‌తో జిల్లా టిడిపి నాయకులు

నారా లోకేష్ పాద యాత్ర త్వరలో ప్రారంభం కానున్న సందర్భంగా సీనియర్ నాయకులు కర్నాటి నాగభూషన్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కర్నాటి అమరనాథరెడ్డి, దుంప వెంకటేశ్వర రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ శుక్రవారం విజయవాడలో నారా లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023, జనవరి 27న లోకేశ్ పాదయాత్రకు ముహూర్తం ఖరారు కావడం హర్షనీయమన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు యాత్ర సాగుతుందన్నారు. తెలుగు యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసుకుంటూ ముందుకు సాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని లోకేష్ సూచించారు. లోకేష్‌ను కలసిన వారిలో ఎస్‌సిసెల్ నగర కార్యదర్శి బిల్లా నవీన్, చిన్నరాముడు, నారాయణస్వామి ఉన్నారు.

యువతులకు ఆత్మరక్షణ అవసరం
కడప అర్బన్ : సమాజంలోని క్రూర వ్యక్తుల నుంచి కొన్ని ప్రతికూల పరిస్థితులలో మనల్ని మనం రక్షించుకోవాలంటే ప్రతి యువతీ సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుని ఉండాలని సాటి స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ అన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కర్రసాము కత్తిసాము శిక్షణ కార్యక్రమం స్థానిక నాగార్జున ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలలో ఒకటైన కర్రసాము, కత్తి సాము యువత నేర్చుకోవాలని కోరారు. తమకు తాముగా, అలాగే ఇతరులను కూడా కాపాడవచ్చని చెప్పారు. అందులో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కడప ప్రాంతంలోని యువతులు నేర్చుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె. మణికంఠ అన్నారు. శిక్షణను కర్రసాము మాస్టర్ జయచంద్ర నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్ర మంలో నాగార్జున ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరెస్పాండంట్ రామ కృష్ణ రెడ్డి, కళాశాల యాజమాన్యం వెంకట్రామిరెడ్డి, బి.వి.ఎస్ మోహన్‌రెడ్డి, యువతులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్న స్టెప్ సిఇఒ సాయిగ్రేస్

చెత్తరహిత ఎర్రగుంట్లకు సహకరించండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



పూల కుండీలు, ముగ్గులతో ముస్తాబు చేసిన సిబ్బంది

ఎర్రగుంట్ల పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ కోరారు. పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి వాటిని గ్రీన్‌స్పాట్‌గా మార్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణములోని పలు ప్రాంతాలను శుభ్రపరిచి, కల్లాపి చల్లి, ముగ్గులు వేసి, పూల కుండీలను ఉంచారు. పట్టణంలోని ప్రజలందరూ కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. నిర్దేశించిన డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సందీప్, శానిటరి ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆయా సబ్‌స్టేషన్‌ల మరమ్మతులు చేపట్టేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ ఒక ప్రకటనలో తెలిపారు. 33/ 11 కెవి సబ్‌స్టేషన్ వేంపల్లె, తాళ్లపల్లె, గిడ్డంగి వారిపల్లెలో ఉండే 11 కెవి ఫీడర్స్ మరమ్మత్తులను చేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. 11కెవి ఫీడర్స్‌లోని ఐటిఐ, నందిపల్లె, బక్కన్నగారిపల్లె, వేంపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, నందిపల్లె, మిట్టపల్లె రైతులకు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

చక్రాయపేట : శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా చక్రాయపేట ఉపకేంద్రం 33/11 కెవి నుంచి వెలువడే గండి ఫీడర్ 11కెవి, మహదేవపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి వెలువబడే 11కెవి కొండప్పగారిపల్లి ఫీడర్లలో శనివారం ఉదయం 8.15 నుంచి మధ్యాహ్నం12.15 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. గండి కొవ్వూరు, మారెళ్ళ మడక, కొండవాండ్లపల్లి, అప్పిరెడ్డిగారిపల్లి, నర్సుపల్లి గ్రామాల రైతులు, ప్రజలు గమనించాలని కోరారు.

ఆవాజ్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణ ఆవాజ్ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా అధ్వర్యంలో 9మందితో ఎన్నుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షులు వీరనాల శివ నారాయణ, పట్టణ అధ్యక్షులు కొట్టాల మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శిగా అచ్చుకట్ల కమాల్ బాషా, పట్టణ కార్యదర్శిగా బాబా బాషా, పట్టణ ఉపాధ్యక్షులుగా మస్తాన్ వలి, పట్టణ కమిటీ సభ్యులుగా హుస్సేన్ వలి, మాబుషరీఫ్, జిలానీబాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నందుకు జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 30న కడపలో జరిగే ఆవాజ్ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు.మహాసభలు జయప్రదనికి ముస్లింలు కలసి రావాలని పిలుపునిచ్చారు.



కె.మహబూబ్ బాషా, ఎ.కమాల్ బాషా

సరైన జీవనశైలితోనే చక్కెర వ్యాధి నియంత్రణ

ప్రజాశక్తి - చాపాడు

సరైన జీవనశైలితోనే చక్కెర వ్యాధిని నియంత్రించవచ్చని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నరహరి శర్మ పేర్కొన్నారు. ప్రపంచ మధుమేహం వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాలలో శుక్రవారం చక్కెర వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి శర్మ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, మారిన ఆహారపు అలవాట్లు, ఊబకాయం, దైనందిన జీవితంలో ఒత్తిడి వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తుల సంఖ్య నానాటికి పెరుగుతోందన్నారు. సివి రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి రూపొందించిన ఛాయాచిత్రాలను ప్రదర్శిస్తూ బ్లూ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మధుమేహం లక్షణాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, రమణారెడ్డి, విజయ, రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నాన్న మాటలే ఆదర్శం

- సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్లపర్తి సర్కిల్)

సంపాదించిన సొమ్ములో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలనే తన తండ్రి చల్లా శివరామయ్య మాటలే తనకు స్ఫూర్తి అని సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు. తన తండ్రి చల్లా శివరామయ్య జ్ఞాపకార్థం శుక్రవారం అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం పట్టణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, చౌడం రవి, రామయ్య గౌడ్, రమణ, జయచంద్ర, శివ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు

వడియారాజులు ఐక్యంగా ఉండాలి

- పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

వేంపల్లె : వడియారాజులు అందరూ ఐక్యంగా ఉంటే రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉందని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంఎంటి కళ్యాణ మండపంలో శుక్రవారం కార్తీక వన భోజనం కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడియారాజులు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈనెల 20న చేపడుతున్న కార్తీక వన భోజనం కార్యక్రమంలో ప్రతి వడియారాజు తప్పక హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఏడాది కార్తీక వన భోజనంలో ... వైసిపి ప్రభుత్వంలో వడియారాజులకు సముచిత స్థానం కల్పించిందని తెలిపారు. సమావేశంలో కాశీపాక రమేష్, డైరెక్టర్ గోగుల కొండయ్య, ఎంపిటిసి బ్రహ్మయ్య, గోగుల మల్లికార్జున, సుబ్బయ్య, రత్నయ్యతోపాటు వడియారాజులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండాపురం : మండల కేంద్రంలో శుక్రవారం బొలెరో పికప్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం కొండాపురం మండలం చెవిటి పల్లె గ్రామానికి చెందిన బెడుదూరు సూర్యనారాయణ (58) తన సూపర్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంలో కూలి పనుల నిమిత్తం వెళుతుండగా బొలెరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని కొండాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ... వైద్యులు అనంతపురం వెళ్లాలని సూచించారు. తాడిపత్రి నుంచి అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యన సూర్యనారాయణ మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వేమన విగ్రహం తొలగింపు దుర్మార్గం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్లపర్తి సర్కిల్)

యోగి వేమన విగ్రహాన్ని తొలగించి వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పెట్టడం చాలా దుర్మార్గమైన చర్యని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక యోగివేమన విగ్రహం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక ప్రణాళిక ప్రకారం ... నిరుద్యోగ నిర్మూలనకు కావలసిన వ్యాపార కంపెనీలు, స్వయం ఉపాధి కల్పనలు, ప్రజలకు ఉపయోగపడే ఒక పని చేయలేదని ... ఈ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని, గత ప్రభుత్వాల్లో ఏర్పాటైన సంస్థల పేర్లను మార్చడం, విగ్రహాలను కూలదోయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నందమూరి యువసేనసమితి అధ్యక్షులు గోపాలకృష్ణ సుదర్శన్, దేవాంగ సంక్షేమ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ... టిడిపి కడప పార్లమెంటరీ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి నాసరి లక్ష్మీనరసింహ, నాయకులు పాల్గొన్నారు.

వంకలు పూడ్చి అక్రమ కట్టడాలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో వంకలు సైతం పూడ్చి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రోజురోజుకు మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు, వంకలు కనుమరుగువుతున్నాయి. ఆక్రమించుకున్న వంకలపై పెద్దపెద్ద భవనాలు నిర్మిస్తున్నారు. మరికొందరు ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. 150, 230లింక్‌లు ఉండే వంకలు నేడు 5లింక్‌లకే పరిమితం అయ్యాయి. ఆక్రమణలు జరిగే ప్రతిసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ ఒత్తిడి, లంచాలా ప్రభావమో ఏమోగాని అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ఒక సెంట్ ప్రదేశం బట్టి లక్షల రూపాయలు పలుకుతోంది. దీంతో ఆక్రమణలు జోరు కొనసాగుతోంది. అధికారులకు కూతవేటు దూరంలో ఉన్న ఆక్రమణలనే ఆపలేని అధికారులు ప్రభుత్వ స్థలాలు, భూములను ఎలా కాపాడుతారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంకలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



యాదవ సత్రం సమీపంలోని వంక



మల్లెపల్లె రోడ్డు లోని వంక ఆక్రమణ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : 'పుట్టా'



ఖాజీపేట : పుట్టా రవికుమార్‌ను సన్మానిస్తున్న లక్ష్మీరెడ్డి, ఫరూక్ అహ్మద్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని టిడిపి యువ నాయకులు డాక్టర్ పుట్టా రవికుమార్ సూచించారు. మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీలో పుట్టా మహేష్ యాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం రాకెట్ రఫీ, మహేంద్ర ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం వలన శారీరక ఎదుగుతలతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. తమ కుటుంబంపై అభిమానంతో ఇలా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ మైదుకూరు పట్టణ టిడిపి నాయకులు వెంకటరమణ, చిన్న ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరాయ స్వామి, గ్రామదేవత పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించి, పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి బాబు, అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచు బిఎన్ శ్రీనివాసులు, మిల్లు శీను, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనపాల జగన్, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ సునీత, బి.ఎన్.నాగేశ్వరి, మేకల చిన్న, గుత్తి నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చాపాడు మండలం బిసి సెల్ అధ్యక్షుడు బుర్రి నాగరాజు ఆధ్వర్యంలో పల్లవోలు వృద్ధాశ్రమంలో పుట్టా మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి నెట్లపల్లి శివరామ్, టిడిపి నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఖాజీపేట : టిడిపి మైదుకూరు నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు పుట్టా మహేష్‌కుమార్ జన్మదిన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ములపాకు గ్రామం వద్ద ఉన్న లారెన్స్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కేకు కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. టిడిపి మండల నాయకులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కమలాపురం ఫరూక్ అహ్మద్, టిడిపి నాయకులతో కలిసి పుట్టా రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుట్టే రాము యాదవ్, వెంకట్రామిరెడ్డి, రామానాయుడు, హరినాథ్‌రెడ్డి, నారాయణ యాదవ్, నంద్యాల సుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

బిజెపి తొత్తుగా వైసిపి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కేసుల మాఫీ కోసం కేంద్రంలో ఉన్న బిజెపికి కాకా పార్టీగా వైసిపి మారిందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న విశాఖ పర్యటనకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తులసిరెడ్డి శుక్రవారం వేంపల్లెలో నల్ల జెండాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ఒక మోసగారి పార్టీ అన్నారు. అలాంటి పార్టీ చేతిలో వైసిపి, టిడిపి, జనసేన కీలుబొమ్మలు కావడం శోచనీయమన్నారు. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రానికి పట్టిన శని గ్రహాలన్నారు. మోడీ ప్రసన్నం కోసం వైసిపి పడరానిపాట్లు పడుతోందన్నారు. పులివెందుల పులి మోడీ వద్ద పిల్లిగా మారిందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, రాఘవయ్య, బద్రీ, షాజహాన్, పురుషోత్తం, రమణమ్మ, సాంబశివ, జానకిరాం, అమర్, శివారెడ్డి, శివ, రాఘవ పాల్గొన్నారు



మోడీకి వ్యతిరేకంగా నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులతో తులసిరెడ్డి

ఆడపిల్లల్ని రక్షిద్దాం.. చదివిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఆడపిల్లల్ని రక్షిద్దాం.. వారిని చదివిద్దాం అని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కెజిబివిఎలో శుక్రవారం బేటి బచావో - బేటి పడావో కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పిఒ మాట్లాడుతూ కెజిబివిలో విద్యార్థినుల యొక్క అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షింఆచరు. ఒక్క చదువులో మాత్రమే కాకుండా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభను చూపాలన్నారు. చదువు-సమాజం రెండు కళ్ళలాగా విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి సంతకం ఒక ఆటోగ్రాఫ్ కావాలన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్, మాజీ ఉప విద్యాశాఖ అధికారి నాగమునిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు టౌన్ బ్యాంక్ బాధితులకు గత పాలకులు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డులో శుక్రవారం ఆయన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ వార్డు ప్రజల నుంచి టౌన్ బ్యాంక్ బాధితులను ఆదుకోవాలని వినతులు వస్తున్నాయని తెలిపారు. గత పాలకులు వైసిపిని విమర్శించడంపై పెట్టిన శ్రద్ధ టౌన్ బ్యాంకు బాధితులను ఆదుకోవడంపై పెట్టాలని హితవు పలికారు. మూడున్నర కోటి స్కాం 5 సంవత్సరాలు అవుతున్నా టిడిపి నాయకులు న్యాయం చేయలేకపోతున్నారని తెలిపారు. గత పాలకులు జమ్మలమడుగు ప్రజలను మోసం చేసి వారి పేర్లతో ఇళ్లను కొల్లగొట్టారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తుందన్నారు. అవినీతి రహితంగా ప్రజలకు పాలన అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజల వినతి మేరకు సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, వైసిపి పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, పార్టీ నాయకులు బడిగింజలు చంద్రమౌళి, పాముల బ్రహ్మానందరెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



టౌన్ బ్యాంకు బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

అవినీతి నిరూపిస్తే ఉరేసుకుంటా : జడ్‌పిటిసి



విలేకరులతో మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్ల విస్తరణలో తానుకానీ, తమ వైసిపి కార్యకర్తలుకానీ అవినీతికి పాల్పడినట్లు ఎమ్మెల్సీ రవీంద్రారెడ్డి నిరూపిస్తే స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉరిశిక్ష వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి లక్ష్మీ గాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఇడుపులపాయ సర్పంచు చలపతితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఎక్కడా అవినీతి జరగకుండా నిష్పక్షపాతంగా రోడ్డు వెడల్పు పరిహారంలో 600 మందికి న్యాయం చేశామన్నారు. నీకు ఇంత.. నాకు ఇంత అంటూ పంచుకుని అవినీతికి పాల్పడినారని దారుణంగా మాట్లాడడం ఎమ్మెల్సీకి తగదన్నారు. అవినీతి సొమ్ము తినాల్సిన పరిస్థితి వైసిపి నేతలకు పట్టదని తెలిపారు. పక్షపాతం లేకుండా అందరికీ న్యాయబద్ధంగా పరిహారం ఇప్పించినట్లు తెలిపారు. డబ్బులు తీసుకున్నట్లు ఇద్దరితోనైనా చెప్పించాలని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక న్యాయం కింద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకులకు ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క దళితుడినైన ఉప ముఖ్యమంత్రిని చేశారా అని ఆయన ప్రశ్నించారు. వేంపల్లెలో కూడా సామాజిక న్యాయంలో భాగంగానే కత్తులూరు ఎంపిటిసి స్థానం ఒసికి వచ్చినప్పటికి బిసికి కేటాయించినట్లు తెలిపారు. అలాగే దేవస్థానం చైర్మన్, ఎంపిపి, ఉప ఎంపిపి స్థానాలు కూడా కేటాయించామని వివరించారు. విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్లు రాఘవేంద్రప్రసాద్, కె.వెంకటేష్, వార్డు మెంబర్ ఆంజనేయులు, ఎంపిటిసి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా

పులివెందుల రూరల్ : పులివెందుల డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూల అంగళ్ళ సర్కిల్ వద్ద శుక్రవారం కళాజాత నిర్వహించారు. ప్రమాదాలను నివారించడం.. గుట్కా, మట్కా నిషేధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ధరించడం వంటి వాటిపై పాటల రూపంలో అవగాహన కల్పించారు.

నామమాత్రం.. మండల పరిషత్ సమావేశం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన నామమాత్రంగా సాగింది. సమావేశాన్ని ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ శాఖల అధి.కారులు వారి శాఖలకు సంబంధించి జరుగుతున్న పనుల గురించి వివరించారు. అనంతరం ఏవైనా సమస్యలు ఉంటే సమా వేశం దృష్టికి తేవాలని అధికారులు ప్రజాప్రతినిధులను కోర గా.. ఒకరిద్దరు ఎంపిటిసిలు మినహా మిగిలిన వారు ఎవ్వ రూ నోరు చెప్పలేదు. ఇలా నామమాత్రంగా సమావేశం ముగిసింది.

పేరు మార్పు

కంచిమిరెడ్డి రిహాసికరెడ్డి, D/o కంచిమిరెడ్డి వెంకట రామసుబ్బారెడ్డి అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. నేను ఇప్పటి వరకు **కంచిమిరెడ్డి రిహాసికరెడ్డి (పాత పేరు)**గా వాడుకలో ఉన్న నా పేరును **అంకిరెడ్డి రిహాసికరెడ్డి** (కొత్త పేరు)D/o అంకిరెడ్డి కేశవరెడ్డి, 40/92-1, ముత్తరాసుపల్లి, చిన్నచౌక్, కడప సిటిగా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు **అంకిరెడ్డి రిహాసికరెడ్డి** గమనించగలరు.

కూరగాయల మార్కెట్ మార్పు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా కొన్ని రోజులు మార్కెట్ యాడ్‌లోకి మారుస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్ మనోహర్ రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్ పేర్కొన్నారు. అ లాగే వారు శుక్రవారం అధికారులతో కలిసి ఇస్లాంపురంలో ఉన్న వాటర్ ప్లాం ట్‌ను పరిశీలించారు. అక్క డ ఉన్న ప్రజలకు శుద్ధి చేసిన నీటినే అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం రంగనాథ స్వామి గుడి సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా కురగాయల అంగళ్లు నిర్వహిస్తున్న దుకాణదారులు, కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారు మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్పతో మాట్లాడి కూరగాయల మార్కెట్‌ను ముద్దనూరు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేయుటకు అవసరమైన ఏర్పాట్లను పరిశీ లించారు. ఇక్కడ.డిసెంబర్ నెలాఖరు వరకు కొనసాగిస్తామన్నారు. మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ సర్వోత్తమరెడ్డి, పురపాలక నాలుగో వార్డ్ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి పాల్గొన్నారు.



యార్డ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, మనోహర్‌రెడ్డి

పిల్లలకు విద్యతో పాటు బుద్ధులు నేర్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లలకు విద్యతోపాటు బుద్ధులు నేర్పించాలని మూవ్‌మెంట్ ఫర్‌పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. యంపిజె ఆధ్వర్యంలో 2వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంపిజె నాయకులు హుశేన్‌బాషా, జాకీర్‌ఉమ్రి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం గురించి వివరించారు. ఎంఇఒ సావిత్రమ్మ మాట్లాడుతూ యంపిజె నిర్వాహులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యంపిజె పట్టణ ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మీడియా కార్యదర్శి మహబూబ్‌బాషా, త్రీటౌన్ ఎస్ఐ తిమోతి, ప్రధానోపాధ్యాయురాలు గీత, విద్యార్థులు పాల్గొన్నారు. **ఉర్దూ జూనియర్ కళాశాలలో..** మౌలానా అబుల్ కలాం జయంతిని స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కలాం స్వాతంత్ర్య సమరయోధులుగా పేర్కొన్నారు. భారతరత్న బిరుదుతో ప్రభుత్వం వారిని గౌరవించిందన్నారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరుతో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షరీఫ్, లెక్చరర్లు మున్వర్, కన్వీనర్ ఖాజామెహిద్దీన్, ముస్లిం మైనార్టీ నాయకులు ఫరీద్‌బాషా, జమాలుద్దీన్, రషీద్‌ఖాన్, గౌసలాజం, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసి విభజన హామీలు ఒక్కటి అమలు చేయలేదని, విశాఖ పర్యటనలోనైనా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ అపు తామని, కడపలో ఉక్కును నిర్మిస్తామని స్పష్టత ఇవ్వాలని సిపిఎం జమ్మల మడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి, అనంతరం ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంలో రాష్ట్రానికి బిజెపి అనేకరకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు ప్యాకేజీ ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. నాడు విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని నినదించి,సాధించిన విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు బిజెపి ప్రయివేట్‌పరం చేస్తోందన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి ఏమి ఇచ్చారని ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారని ఆయన మోడీని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు మహబూబ్ బాషా, సిపిఎం ప్రసాద్‌రెడ్డి, ఇమామ్, భీష్మ, విజయ్ పాల్గొన్నారు.



ఎఒకు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

కొండాపురంలో రైళ్లు ఆపాలని వినతి

కొండాపురం : కొండాపురంలో రైళ్లు ఆపండి సారూ.. అంటూ ప్రజలు రైల్వే అధికారులను మొరపెట్టుకున్నారు. ఆ మేరకు శుక్రవారం రైల్వేస్టేషన్లు, ట్రాక్‌ల తనిఖీ నిమిత్తం వచ్చిన డివిజనల్ రైల్వే మేనేజర్ కె.వెంకటరామిరెడ్డికి కొండాపురం ప్రజలు ఆయనకు వినతిపత్రాన్ని అందించారు. కొండాపురంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి కరోనా మహమ్మారి 2020 వరకు అన్ని రకాల రైళ్లు ఆగి నీటిని నింపుకొని వెళ్లేవని తెలిపారు. దీంతో ఇక్కడ నుంచి అనేక రకాల ఆదాయ మార్గాలు కూడా ఉండేవని అ న్నారు. అలాంటి స్టేష న్‌లో నేడు రైళ్లు నిలపకపోవడం అన్యా యమని ఆదేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొండాపురం స్టేషన్‌లో కనీసం నాలుగు రైళ్లనైనా ఆపాలని ప్రజలు విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన డివిజనల్ రైల్వే మేనేజర్ మాట్లాడుతూ కొండాపురంలో రైల్వేకి ఆదాయ మార్గం ఉన్నట్లు రికార్డులు లేకపోవడం వల్ల ఆగిపోయాయని తెలిపారు. గతంలో ప్రజల విన్నపాల మేరకు రైళ్లు నిలపడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. త్వరలో కొండాపురంలో రైళ్లు నిలిపే అవకాశం ఉందన్నారు.



ఉన్నతాధికారికి వినతి పత్రం అందిస్తున్న ప్రజలు



'కవి కనకదాసు సేవలు ఎనలేనివి'

ప్రజాశక్తి - రాయచోటి

ఆధునిక కవి, తత్వవేత్త, సంగీత కారుడు, స్వరకర్త శ్రీ కనకదాసు సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని కలెక్టర్ గిరీష పిఎస్ కొనియాడారు. శుక్రవారం కనకదాసు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన కనకదాసుచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన కనకదాసు1905-1609 కాలంలో జీవించిన గొప్ప భక్తుడు ఆధునిక కవి, తత్వవేత్త, సంగీత కారుడు, స్వరకర్త అన్నారు. అప్పటో కనకదాసు వెనుకబడిన కులాల వారి సంక్షేమం కోసం అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వెనుకబడిన కులాల వారు అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ సామాజిక బాధ్యతగా ఎనలేని కృషి చేశారన్నారు. కురుబ కులాల జీవనోపాధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అప్పట్లో ఇతర హరిదాసుల్లాగే ఈయన కీర్తనల్లో సాధారణ కన్నడ భాషను ఉపయోగించేవారని ఇంతటి గొప్ప ఆధునిక కవి కనకదాసు ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'విభజన హామీలు అమలు చేయాలి'



రాయచోటి : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోడీ గోబ్యాక్.. గోబ్యాక్ అంటూ సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పి.రెడ్డెయ్య బస్టాండ్ రోడ్ లో నిరసన తెలిపారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి న్యాయం చేయకపోగా పదే పదే అన్యాయం చేస్తున్న ప్రధాని మోడీ విశాఖ పర్యటనకురావడం దుర్మార్గమని ఆయన అన్నారు. ప్రజలకు ద్రోహం చేసిన బిజెపికి పెద్దపీట వేసి, ఆహ్వానం పలికేందుకు జనసమీకరణ చేయాల్సిన అవసరం ఏముందని వారు అన్నారు. ఒకవైపు బిజెపి నాయకులు ఆహ్వానం తాము పలుకుతామని చెబుతుంటే వారికంటే ముందే వైసిపి నాయకులు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనసమీకరణ చేయడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ఇంతవరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు నెరవేర్చలేదని, రైల్వేజోన్ ఏర్పాటు చేయలేదని అయినా ప్రధానికి పెద్దపీట ఎందుకు వేస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సుజల స్రవంతి పనులు జరగడం లేదని, పోలవరం ప్రాజెక్టు పరిధిలో గిరిజనుల గ్రామాలు మునిగిపోతుంటే పట్టించుకోలేదని, పునరావాస నిధులు ఇవ్వకుండా వారికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే ఇంతవరకు కేంద్రం స్పందించలేదని విమర్శించారు. ప్రధాని మోడీ పర్యటనను స్వాగతించడం అంటే స్టీలు ప్లాంటు అమ్మకాన్ని ఆమోదిస్తున్నారా అనేదాన్ని వైసిపి నాయకులు స్పష్టం చేయాలన్నారు. 700 రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమాలను పరిగణలోకి తీసుకుని ప్రయివేటీకరణ ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అగ్గిరాముడు, శ్రీనివాసులు, హరి, ప్రసాద్, నాగేశ్వర, రవి, పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ వామపక్షాలు, సిఐటియు, ఎఐటియుసి, ఎస్ఎఫ్ఐ నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మూకట్లు చేత బట్టి వినూత్నంగా నిరసన తెలియజేశారు. మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి చిట్వేలి రవి కుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎస్ రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివరామకృష్ణదేవరా, ఆటో యూనియన్ జిల్లా నాయకులు నాగేశ్వర యాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్ పాల్గొన్నారు. **ములకలచెరువు:** మండల కేంద్రంలో వామపక్షాలు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, గణేష్, చంద్ర వేమనారాయణ, జయకర్ పాల్గొన్నారు.



రాజంపేట : నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ గిరీష



అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

భారత రత్న, భారతదేశ మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి, మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆజాద్ దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వతంత్య సమర యోధులుగా, కవిగా, రచయితగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి గొప్ప నాయకులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. జాయింట్ కలెక్టర్ తామీమ్ అన్సారియ మాట్లాడుతూ దేశం, రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే అందుకు కారణం విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషే అన్నారు. కార్యక్రమానికి ముందు ముఖ్య అతిథులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ రహిమాన్, ముస్లిం మత పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **గాలివీడు :** అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం బి.రెడ్డన్న, ఉపాధ్యాయులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశానికి తొలి విద్యా శాఖా మంత్రిగా సేవలందించి 1958 ఫిబ్రవరి 22న చనిపోయారని చెప్పారు. మరణానంతరం 1992 భారతరత్న ప్రదానం చేశారని తెలిపారు. విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చిన మహనీయుడి పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమని తెలిపారు. **బి.కొత్తకోట:** సుంకు కళాశాలలో ప్రిన్సిపల్ మంజునాథ్ ఆధ్వర్యంలో జాద్ జయంతి నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు. **నందలూరు :** పాటూరు తురకపల్లె పాఠశాలలో అబుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేస్తున్న పాటూరు తురకపల్లె పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు షేక్.హాఫిజుల్లాకు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు అల్లం అశోక్ కుమార్, మండల అధ్యక్షులు లీలాకృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి మహేశ్వర బాబు, మహిళా ఉపాధ్యక్షులు లక్ష్మికాంతమ్మ, కార్యదర్శి సంధాని, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, సిమ్రీన్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.వెంకట శివారెడ్డి, అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సుఖవ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్న కొండయ్య

సుఖవ్యాధులకు నివారణ చర్యలు అవసరం

- హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య

ప్రజాశక్తి-పీలేరు

సుఖ వ్యాధులకు మేలైన చికిత్సతో నివారణ సులభమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. మండలంలోని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం గాండ్లపల్లి గ్రామంలో సుఖవ్యాధులు-నివారణాచర్యలు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత లోపం, సురక్షితం కాని లైంగిక చర్యల ద్వారా వ్యాప్తిచే గనేరియా, సిఫిలిస్ మొదలగు సుఖ వ్యాధుల నిర్మూలనకు అవగాహన కలిగి, సత్వర చికిత్సతో వ్యాధుల నిర్మూలన సాధ్యమని అన్నారు. సుఖ వ్యాధులున్న వారి సంతతిపై కూడా అది తీవ్ర చెడు ప్రభావం చూపుతుందని, రక్త పరీక్షలతో నిర్ధారించే సుఖ వ్యాదులవల్ల వంధత్వం, శిశువు ముందుగా జన్మించడం, అంగవైకల్యం, తక్కువ బరువుతో పుట్టడం, పొత్తికడుపులో నొప్పి, స్రావాలు, జ్వరం, జననేంద్రియాల్లో దురద, మూత్రవిసర్జనలో మంట, నొప్పి, కీళ్ల వాపులు, మానసిక, శారీరక లక్షణాలతో సుఖవ్యాధి గ్రస్తులు బాధ పడతారని చెప్పారు. ఇలాంటి సమస్యలున్న దంపతులిద్దరూ సరైన సమయంలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందితే నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్ఎం నాగవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-చిన్నమండెం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వై. శ్రీహరినాయుడు 12వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు డి. జయచంద్ర పేర్కొన్నారు. శ్రీహరి నాయుడు చిన్నప్పటి నుంచి ఆటల పోటీలలో ప్రతిభ కనపరచడంతో గుర్తించిన ఉపాధ్యాయులు అతన్ని జిల్లాస్థాయిలో పాల్గొనేలా చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

'గిరిజన గ్రామాలాభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి - రాయచోటి

కలకడ మండలం దిగువతాండ, పెనగలూరు మండలం, మల్లెలమ్మ దిన్నె గిరిజన గ్రామాలలో ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ గిరీషా పిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కలకడ మండలం దిగువతాండ, పెనగలూరు మండలం మల్లెలమ్మదిన్నె గిరిజన గ్రామాలలో ఇటీవల పర్యటించినప్పుడు స్థానికులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దిగువ తాండకు సిసి రోడ్డు, కమ్యూనిటీ హాల్, బస్ షెల్టర్ మంజూరైన పనులన్నీ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆరు జలకళ దరఖాస్తులకు సంబంధించి 15 రోజుల్లోగా కనీసం మూడు బోర్ల వేయాలని సూచించారు. ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కలెక్టర్ వివరించారు. శ్మశాన వాటికకు సంబంధించి స్థల కేటాయింపు ప్రతిపాదనతో పాటు త్వరగా ఆ స్థలాన్ని అప్పగించాలని తహశీల్దారుకు కలెక్టర్ సూచించారు. రాబోయే 15 రోజుల్లోగా వ్యవసాయ పట్టాలిచ్చేందుకు ఆ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. 20 మంది ఇంటి పట్టాలు కావాలని కోరారని, వాటికి సంబంధించి జగనన్న కాలనీ లేవుట్ వేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఆ గ్రామంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ వారంలోగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌ఓ ఇంజనీర్‌ను ఆదేశించారు. దిగువతాండ గ్రామంలో ఆలయం కావాలని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధి రుణాలు ఇవ్వాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. ఆ గ్రామంలో పాఠశాల అలాగే ఆధార్ కార్డు చేర్పులు, మార్పులు, బయోమెట్రిక్, ఇళ్ల నిర్మాణాలు, తాగునీరు తదితర అర్జీలు వచ్చాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిలై, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ విస్తరణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో డిసెంబర్ 1 నుంచి అదనంగా 190 గ్రామాలలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విస్తరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా పాలకు గిట్టుబాటు ధర పాడి రైతుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. సహకార డెయిరీలకు ఆర్థిక దన్ను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే మదనపల్లి, రామసముద్రంలలో రెండు చొప్పున, నిమ్మనపల్లిలోని ఒక బిఎంసి, మొత్తం ఐదు బిఎంసిల ద్వారా రోజుకు 34 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. జిల్లాలోని పెద్ద మండెం మండలంలోని వీరవరం, వెలిగల్లు, రామాపురం మండలం నల్లగుట్టపల్లి, గాలివీడు మండలం నూలివీడు గ్రామం, కురబలకోటలో నిర్మిస్తున్న ఐదు బిఎంసిల నిర్మాణం తుది దశలో ఉన్నాయని చెప్పారు. ఐదు బిఎంసిలు అందుబాటులోకి వస్తే రోజుకు ఎన్ని లీటర్ల పాల సేకరణ చేయవచ్చునని అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా, అంచనాగా వెంటనే ఒక రోజుకు పదివేల లీటర్లను సేకరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ డెయిరీలకు పాలను పోసే రైతులు అధిక ధర పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెన్న శాతాన్ని బట్టి పాలకు ధరను చెల్లిస్తారని, ఆవుపాలకు ఒక లీటరుకు కనీసం రూ. 29 నుంచి రూ. 39 చొప్పున, గేదె పాలకు ఒక లీటరుకు రూ.39 నుంచి రూ.79 వరకు చెల్లించడం జరుగుతుందనే విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. అదనంగా పాల విస్తరణ చేయనున్న 190 గ్రామాలకు 12 రూట్‌లను గుర్తించిందని చెప్పారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జెసి తమీమ్ అన్సారియా, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ గుణశేఖర్ పిల్లాయి, సహకార శాఖ ఏడి గురుప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

వేగవంతంగా గృహ నిర్మాణాలు : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను త్వరితగతన పూర్తిచేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా గృహాలు నిర్మించే విధంగా లబ్ధిదారులతో మమేకమై, లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులను వీలైనంత త్వరగా కల్పించాలని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పల్లెల్లో పర్యటించినప్పుడు చాలా వరకు గృహాలకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, డిఇఇ కుప్పుస్వామి, ఆర్డబ్ల్యూఎస్ డిఇ శివరుద్రగౌడ్, ఎంపిడిఒ నాగార్జునరావు, ఉప సర్పంచి తోట శివ సాయి, హౌసింగ్ ఎఇ మురళి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి : ఎపిడి

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎపిడి రెడ్డయ్య నాయుడు పేర్కొన్నారు శుక్రవారం ఎంపిడిఒ సభాభవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ బడ్జెట్‌కు తగ్గట్టుగా కూలీల పని దినాలు పెంచాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ కూలి అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధి కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో సంపత్ కుమార్, టిఎలు, ఎఫ్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా సిఎంఒగా కరుణాకర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబ లైజేషన్ ఆఫీసరుగా జి.కరుణాకర్ నియమి తులయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవ రెడ్డి ఆయనకు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల విభాగంలో పనిచేసిన ఆయన నూతన జిల్లాలు ఏర్పడిన తరువాత పని సర్దుబాటు వల్ల అన్నమయ్య జిల్లాకు వచ్చారు. కలెక్టర్ గిరీషా ఆయనను సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసరుగా నియమించారు. పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి కృషి చేస్తానని చెప్పారు.



నియామక పత్రం అందుకుంటున్న కరుణాకర్

పాఠశాలల్లో జిల్లా కో-ఆర్డినేటర్ తనిఖీలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బి.రాచపల్లి, రామాపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ప్రథమ్ ఆర్గనైజేషన్ అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ రహమత్ అలీఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా గత నెలలో ఉపాధ్యాయులకు బేస్ లైన్ వెరిఫికేషన్‌పై ఇచ్చిన శిక్షణ పై మూడు, నాలుగు, ఐదు తరగతుల వెనుకబడిన విద్యార్థులకు కామన్ మెథడాలజీ పద్ధతిలో విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు, ఈ అంశాలను తరగతి గదులలో అమలు చేయాలన్నారు, బీసీ కాలనీలో సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకుని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిస్వామి, విశ్వనాథ్, రామచంద్ర, వెంకటసుబ్బయ్య, విజయశ్రీ, సుజాత, మునీర్‌ఖాన్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

కాడెద్దులు... కనుమరుగు

వ్యవసాయానికి గుదిబండలా యాంత్రీకరణ



ప్రజాశక్తి - రామసముద్రం

ఒకప్పుడు ఏ పల్లెలో చూసినా కాడెద్దులతో కళకళలాడుతుండేవి. భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తూ అందరికీ తిండిపెట్టే రైతన్నలు ఇంటింటా కనిపించేవారు. వ్యవసాయానికి తమవంతు సాయం చేయడానికి కాడెద్దులు ఉండేవి. పాలిచ్చేందుకు ఆవులు, బర్రెలు ఉండేవి. కుటుంబంలోని మహిళలు పొలం పని అయిపోగానే ఎద్దుల కోసం, పాలిచ్చే పశువుల కోసం మోపు గడ్డి కోసి పశువుల పాకకు ఎద్దులబండిపై తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోయాయి. ఎద్దుల స్థానంలో యంత్రాలు వచ్చాయి. జోడెడ్లు మాయమయ్యాయి. ఇంటి భారం మోసే పశువులు రైతుకు భారమయ్యాయి. రైతుల ఇళ్ళలో పాడికళ తప్పిందని చెప్పుకోవచ్చు. యంత్రాలతో మానవుని జీవనం యాంత్రికంగా అడుగులు వేస్తోంది.

'ఎద్దు ఏడ్చిన వ్యసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం..' నిలబడదని నానుడి ఉంది. నేటి యాంత్రిక జీవనంలో యంత్రాలతో పాటు రైతు జీవితం కళతప్పింది. నాడు చిన్న, సన్నకారు, భూస్వామి అనే తేడా లేకుండా రైతులు వ్యవసాయ పనుల కోసం పశువులపైనే ఆధారపడేవారు. వర్షాలు పడగానే జోడెడ్లతో కాడి కట్టి కొత్త ఆశలతో వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లు. దుక్కి దున్నడానికి, భూమి చదును చేయడానికి తదితర పనులకు ఎద్దులనే వాడేవాడు. నాడు పదిమంది రైతులకు కనీసం నలుగురు రైతుల దగ్గర జత ఎద్దులు, భూస్వామి ఇంట్లో నాలుగైదు జతల ఎద్దులు ఉండేవి. వాటిని మేపడానికి ఏళ్ల తరబడి ఓ కూలిని నియమించుకునేవారు. ఆవులు, గేదెలను, గొర్రెలు పెంచుకునేవారు.ఇప్పుడు ఎక్కడ చూసినా ఎద్దులేని వ్యవసాయం నడుస్తోంది. గతంలో వరుసగా వచ్చిన కరువు పరిస్థితులకు తోడు యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతుల ఎద్దులను అమ్ముకున్నారు. వ్యవసాయంలో పశువుల వాడకం తగ్గి ఎక్కడ చూసినా ట్రాక్టర్లు, రొటోవేటర్లు కనిపిస్తున్నాయి. వరిసాగు చేసే రైతులు బురదమడిలో దున్నడానికి ఎద్దులనే వాడేవారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పరుగులు పెడుతున్న క్రమంలో కేజీ వీల్స్ , రోటోవేటర్లు అందుబాటులోకి వచ్చాక పూర్తిగా ఎద్దులను ఉపయోగించడం మానేశారు. ఎద్దుతో రైతుకు, భూమికి ఉన్న అనుబంధం ఒక్కొక్కటిగా తెగిపోతుందనడానికి ఇవన్నీ కారణాలేనని చెప్పుకోవచ్చు. నేడు పాడి పరిశ్రమ వలన చాలా కుటుంబాలు నడుస్తున్నాయి. రైతులు వ్యవసాయం కన్నా పాడిపైనే ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఎద్దుల సంఖ్య తగ్గి ప్రతి గ్రామంలో పాడి ఆవుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం పాడి పశువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. వ్యవసాయం చేసి నష్టాలుపాలు కావడం కన్నా పశుపోషన వల్ల పాల విక్రయాలు ద్వారా చాలా కుటుంబాలు నడుస్తున్నాయి.

ఎద్దుల ధరలు ఆకాశంలో...

ప్రస్తుతం ఎద్దుల ధరలు విపరీతంగా ఉన్నాయి. మామూలు ఎద్దులయితే జత సుమారు రూ.75 వేల నుంచి రూ.90 వేల వరకు ఉన్నాయి. బలమైన జత అయితే రూ.లక్షకు పైగా ధరలు ఉన్నాయి.

- శ్రీరాములు, రైతు, కొత్తూరు.

ట్రాక్టర్‌తోనే వ్యవసాయం

తనకు ఇంట్లో రెండు జతల ఎద్దులు ఉండేవి. ట్రాక్టర్లు, మిషన్లు వచ్చాక ఎద్దులను అమ్మేశాం. ఇప్పుడు మొత్తం మిషన్లతోనే వ్యవసాయం చేస్తున్నాం. ఎద్దులతో పనులు ఆలస్యం అయ్యేవి, యంత్రాలతో వేగంగా చేస్తున్నా ఖర్చులు పెరిగి ఏటా నష్టం వస్తోంది.

- గజ్జల రాజారెడ్డి, రైతు, నారిగానిపల్లి.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ గిరీష ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి మున్సిపాలిటీ రాయుడు కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. పిల్లల ఎత్తులు, బరువులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి అదనపు పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రోజూ భోజనం, పాలు, గుడ్లు తదితర బలవర్ధకమైన ఆహా రాన్ని నాణ్యతతో అందించాలన్నారు. పౌష్టికాహారం భుజించడం ద్వారా రక్తహీనత లోపాలు రావని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులలో పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులను నిరంతరం పర్యవేక్షించాలని అంగన్వాడీ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. తనిఖీలో ఐసిడిఎస్ పీడీ నిర్మల, సిడిపిఒ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థి ఎత్తును పరిశీలిస్తున్న కలెక్టర్

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలసిన ఎంఇఒ

ప్రజాశక్తి-రామాపురం

లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డిని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు తన సిబ్బందితో కలిసి ఆయన చాంబర్ లోమార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు విశ్వనాథరెడ్డి మొదటిసారిగా చైర్మన్ బాధ్యతలు తీసుకొనడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు ఆయన వెంట టీచర్స్ యూనియన్ నాయకులు శివశంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది, చంద్రశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసింది. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి జడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయులు కె.గోపీనాథ్, చిన్నతిప్పసముద్రం జడ్పీ పాఠశాల సిటిఎం బదిలీ చేసింది. ఈయన స్థానానికి చిన్నతిప్పసముద్రం జడ్పీ పాఠశాల సిటిఎం గణిత ఉపాధ్యాయుడు డి.సుధాకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నాగవరం జడ్పీ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు భరణి తిరుపతి జిల్లాలోని ఎంఆర్‌పల్లి జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. టి.సుండుపల్లి మండల జడ్పీ పాఠశాల స్కూల్‌అసిస్టెంట్ పిఎస్ పి.ఉమ, కడప జయనగర్ కాలనీలోని జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. సంబేపల్లి ఎపి మోడల్ స్కూల్ పి.యోగీశ్వరరెడ్డి(టిజిటి) అనంతపురం జిల్లా గార్లదిన్నెలోని ఎపి మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.చిన్నవెంకట సుబ్బయ్య (తెలుగుఎస్ఎ) కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం దొర సానిపల్లి జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. చాపాడు మండలం నరసింహపురం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు టి.డోర్నాక యూనిస్, కడప మండలం జయనగర్ కాలనీ జడ్పీ బాలికల హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం జేమ్స్‌పేట ఎంపిపి స్కూల్ నుంచి రాజురామచంద్రరావు (పిఎస్‌హెచ్ఎం) గంగాభవంతి నగర్ ఎంపిపి స్కూల్‌కు బదిలీ కావడం గమనార్హం.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి- కలకడ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహశీల్దారు రాము అన్నారు. శుక్రవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలను నిర్వహించడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడటం, మాత, శిశు మరణాలు సంభవించడం, గృహహింస, త్వరగా విడాకులు పొందడం, అనీమియా వంటి జబ్బులు రావడం, పౌష్టికాహార లోపం గల పిల్లలు జన్మించడం, అంగవైకల్యంతో పిల్లలు పుట్టడం వంటివి జరుగుతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇందుకోసం కమిటీ వేశామన్నారు. కమిటీలో ఎంపిపి, ఎంపిడిఒ, ఎంఇఒ, హెల్త్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఎఎస్ఒ, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారన్నారు. సమావేశంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, ఎంఇఒ మునీంద్రనాయక్, హెల్త్ సూపర్వైజర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద, ఎఎస్ఒ రెడ్డప్ప నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ ముఖ్య ఉదేశ్యమని బాంక్ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. శుక్రవారం మదనపల్లి యూనియన్ బ్యాంక్ శాఖలో 104వ వార్షికోత్సవ వేడుకలు, శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఉత్తమమైన సేవలందించడమే ముఖ్యఉద్దేశమన్నారు. యూనియన్ బ్యాంక్ ద్వారా వ్యాపారవేత్తలకు, స్వయం సహాయక సంఘాలకు, ఉద్యోగులకు, ఖాతాదారులు మహిళలకు, గృహాలు, వాహనాలు, బంగారు నగలపై సకాలంలో రుణాలు అందిస్తామన్నారు. గృహరుణాలు, వాహన రుణాలు మరియు వ్యాపారస్థులకు తక్కువ వడ్డీకి రుణాలు అందుకున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి రైతులకు వ్యవసాయ సంబంధిత రుణాలను అందిస్తున్నామనని, ఫిక్సిడ్ డిపాజిట్లపై 599 రోజులుగాను, 7 శాతం, 444 రోజులకు 6.70 శాతం వడ్డీ రెటు వున్నాయని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కు వడ్డీలపై 0.50 శాతం అధికంగా ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు రైతులు, ఉద్యోగులు, చిన్నకారు రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మా బ్యాంక్ ఖాతాదారులకు డెబిట్ కార్డ్స్, క్రెడిట్ కార్డ్స్, ఇంటర్ నెట్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ మేనేజర్ షణ్ముగం, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని ఎలువనెల్లూరు పంచాయతీ అనప్పల్లి గ్రామ ప్రజలు సౌకర్యార్థం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించిన సందర్భంగా శుక్రవారం కన్వీనర్ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో బస్సు ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా చొరవతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి, ఎంపిటిసి పద్మ, నాయకులు ఈశ్వర్, మాజీ సర్పంచ్ కత్తి వాలెప్ప, కేశవ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా షబ్బీర్‌బాషా

ప్రజాశక్తి-కలికిరి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని మహాల్‌కు చెందిన షబ్బీర్‌బాషా శుక్రవారం గుంటూరులో జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో అవార్డును అందుకున్నారు. ఆయన చిన్నమండెం ఉర్దూ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన బోధించే పదవ తరగతి గణిత శాస్త్రంలో విద్యార్థులు వంద శాతం పలితాలు సాధిస్తున్నారని, పాఠశాల అప్ గ్రెడేషన్‌కు, పాటశాల అభివృద్ధికి ఆయన కృషి చేయడంతో ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉత్తమ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నందుకు మైనారిటీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్, మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్ ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌బాషా మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును స్వీకరించడం ఎంతో గర్వంగా ఉన్నదని, దీంతో విద్యార్థిని విద్యార్థులకు మరింత విద్యను అందిస్తూ పాఠశాల మరింత అభివ ృద్ధి చేయడానికి క ృషి చేస్తానని పేర్కొన్నారు. మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నాదీమ్, మైనారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇంతియాజ్ అహ్మద్‌ల చేతుల మీదుగా అవార్డును స్వీకరించడం ఎంతో గర్వకారణమన్నారు.

పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లి ఆర్‌బికెలో శుక్రవారం వైయస్సార్ పట్టుబడి కార్యక్రమంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతులకు మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర పట్టుమండలి సైంటిస్ట్ దీప వీవన్ మల్బరీతోట సాగు ,పట్టుపురుగుల పెంపకం, షెడ్ల నిర్మాణం, తీసుకోవలసిన జాగ్రత్తలు, మార్కెట్ సౌకర్యాలు, తదితర అంశాలపై వివరించారు. మండలంలో సుమారు 375 మంది రైతులు 425 ఎకరాలలో మల్బరీ సాగు చేశారన్నారు. బైఒల్టిన్ పట్టుపురుగుల పెంపకంతో మంచి దిగుబడితో మంచి ఆదాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునన్నారు. వాతావరణ అనుకూల పరిస్థితులు ఉండడంతో రైతులు మార్పు చెంది బైవోల్టిన్ పట్టుపురుగుల పెంపకం చేపట్టాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్లో బైఒల్టిన్ పట్టుగూడ్లు కిలో 700 నుండి 800 రూపాయల వరకు ధర పలుకుతుందన్నారు. రైతులు సిరికల్చర్ అధికారులు సూచనలు మేరకు బైవోల్టిన్ పట్టుపురుగులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ విజయలక్ష్మి, ఆర్‌బికె అధ్యక్షులు శంకర్ రెడ్డి, ఎడిఎస్ఒ రామ్మోహన్, ఎస్ఒలు నంజుండరావ్, రసూల్, సిరికల్చర్ అసిస్టెంట్లు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను గుర్తించండి : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని ముష్టూరు, రెడ్డివారిపల్లి, బండ్లపై, రాచవేటివారిపల్లి గ్రామాలలో ఎంపిపి నరసింహులు, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, ఎంపిడిఒ లీలా మాధవి, స్థానిక సర్పంచులతో కలిసి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామ సచివాలయంలో రికార్డులను, ఉద్యోగుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. గ్రామాలలో ప్రాధాన్యత కలిగిన త్రాగునీరు, పారిశుధ్యం, మురికి కాలువల, వీధిలైట్లు నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు వారి ఉద్యోగ బాధ్యతలకు లోబడి పనిచేయాలని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించినప్పుడే వారు ప్రభుత్వాన్ని ఆదరిస్తారని, ఆ దిశగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ప్రజలకు సేవనందించాలని తెలిపారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందడుగు వేస్తున్నాదని, స్థానిక సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకై ప్రాధాన్యత క్రమంగా పనులను గుర్తించి, మూడు రోజుల్లో ప్రజా ప్రతినిధులకు అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామాన్ని అభివృద్ధి చేయటానికి అధికారులతో కలిసి అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తారని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి చెందినప్పుడే పల్లెల్లో ప్రగతి కనిపిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రాయుడు, రెడ్డమ్మ, వెంకటరత్నమ్మ, సుబ్రమణ్యం, ఎంపిటిసిలు విజయలక్ష్మి, రెడ్డివెంకటేష్, నాయకులు నరేంద్ర రెడ్డి, చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి లోకేశ్వరి, మారెప్ప, ఎర్ర మల్లయ్య నాయుడు, సరస్వతి, గాయత్రి, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లి రోడ్డులో ప్రయాణించే వాహనాలను శుక్రవారం స్థానిక ఎస్ఐ ఫాతిమా తనిఖీ చేశారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రోడ్డ భద్రతా నియమాలను తప్పక పాటించాలని తెలిపారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి రికార్డులను కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడ్ చేయరాదని సూచించారు. మైనర్లు వాహనాలను నడపరాదన్నారు. ధ్రువీకరణ (రికార్డులు) పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుము వేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'బలహీనంగా ఉన్న చిన్నారులపై దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉండాల్సిన వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు తక్కువ ఉన్న చిన్నారులపై పర్యవేక్షణ చేయాలని ఐసిడిఎస్, మహిళా పోలీస్, ఉఎన్ఎం లను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ, గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్ష, ఆనిమిక్ పై ప్రత్యేక దృష్టి వంటి అంశాలపై సిడిపిఒ, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోని అంగన్వాడీ కేంద్ర పరిధిలోని పిల్లల ఎత్తు, బరువు రిపోర్టులు కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. రిపోర్టు లేకపోతే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. తక్కువగా బరువు, ఎత్తు పెరగకుండా ఉండే పిల్లలు, ఎదుగుదల సరిగాలేని పిల్లలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా పర్యవేక్షణ చేయాలన్నారు. యాప్‌లో ఎత్తు, బరువు సరిగా ఎంట్రీ చేయడం లేదని చెప్పారు. ఈ అంశంపై మహిళా పోలీసులు ర్యాండంగా తనిఖీ చేయాలన్నారు. వంట సరిగా చేయకపోవడం, పౌష్టికాహారం ఇవ్వకపోవడంపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలని సిడిపిఓలను కలెక్టర్ సూచించారు. వీటన్నింటిపైన మహిళా పోలీసులు పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు వంద శాతం చేయాలని డాక్టర్లను ఆదేశించారు. సచివాలయం పరిధిలో రక్తహీనత లోపంతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో హిమోగ్లోబిన్ పెంచేందుకు, ఏడు కన్నా తక్కువ ఉన్నవారికి రెగ్యులర్‌గా పరీక్షలు చేయాలని చెప్పార. విధులలో నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, ఐసిడిఎస్ పీడీ నిర్మల, డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్, రాయచోటి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డిఎంఒ రియా బేగ్, డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్‌బిఎస్ కె డాక్టర్ శేషగిరి, డాక్టర్లు, సిడిపిఒలు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ గిరిష పిఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో పంచాయతీ రాజ్‌శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగం పెంచాలని, గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఇంజినీర్‌లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని ఇంజినీర్లను ఆదేశించారు. బిల్లులను ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమష్టిగా పనులన్నింటినీ నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు అత్యంత ప్రాధాన్యత క్రమంలో త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానం పలకాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ తదితర భవనాలను వెంటనే అప్పగించాలన్నారు. జిల్లాలో గ్రామ సచివాలయాల భవనాలు ఇంకా ప్రారంభం కానివి 3, బిలో బేస్మెంట్ లెవెల్ 4, బేస్మెంట్ లెవెల్ 16, ఆర్ ఎల్ 28, రూఫ్ లైడ్ 33, ఫినిషింగ్ 82 ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఇంకా ప్రారంభం కానివి 3, బిలో బేస్మెంట్ లెవెల్ 7, బేస్మెంట్ లెవెల్ 47, ఆర్ ఎల్ 51, రూఫ్ లైడ్ 25, ఫినిషింగ్ 82 ఉన్నాయన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ఇంకా ప్రారంభం కానివి 13, బిలో బేస్మెంట్ లెవెల్ 9, బేస్మెంట్ లెవెల్ 72, ఆర్ ఎల్ 35, రూఫ్ లైడ్ 31, ఫినిషింగ్ 57 ఉన్నాయన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులు వెంటనే చేపట్టాలని పంచాయతీ ఇంజినీర్లను ఆదేశించారు. వారం వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. చేసిన పనులకు సంబంధించి వెంటనే బిల్లులు అప్లోడ్ చేయలన్నారు. యుద్ధ ప్రాతిపదికన బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ బిల్డింగ్ లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వెనుకబడిన మండలాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి దిశా నిర్దేశం ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సురేషకుమార్, ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గిరీష

జాగ్రత్తలు పాటిస్తే మంచి ధర : ఎఒ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కోత, నూర్పిడి, నిల్వ విషయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి ధర పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారి స్వాతి తెలపారం. వరి కంకిలో 80 శాతం గింజలు గడ్డి రంగులోకి మారినప్పుడే కోతకు ఉప క్రమించాలన్నారు. కోత సమయంలో ధాన్యంలో తేమశాతం 26 శాతం వరకు ఉంటుందని, నూర్పిడి చేసిన ధాన్యాన్ని వెంటనే టార్పాలిన్, లేదా ప్లాస్టిక్ పట్టల మీద, లేదా మిద్దపైన పల్చగా పోసి ఎండకు ఆర పెట్టాలని సూచించారు. దీనివల్ల గింజ రంగు మారకుండా నాణ్యంగా ఉంటుందన్నారు. ధాన్యంలో తేమ శాతం 14 శాతం కంటే ఎక్కువ ఉండకుండా నిల్వ చేసుకోవాలని తెలిపారు. లేదంటే ధాన్యం చెడిపోతాయని చెప్పారు. వరి కోత సమయంలో గాలులు, వర్షాలు కారణంగా పైరు పడిపోతే ధాన్యం మొలకెత్తడం కానీ మారవచ్చని చెప్పారు. కొసలపై 50 గ్రాములు ఉప్పు ద్రావణాన్ని లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

ఐక్యవేదిక కోసం కలసికట్టుగా నడుద్దాం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వాల్మీకి, ముదిరాజ్ ఐక్యవేదిక కోసం అందరం కలసికట్టుగా నడవాలని కర్నూల్ జోన్ హోంగార్డు ఎస్పీ మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దేవలంపల్లి చెన్నకేశవ స్వామి ఆలయంలో వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులు తమ పిల్లలను మంచి విద్యావంతులు చేయాలని సూచించారు. ముందుగా మానవత విలువలను పిల్లలకు నేర్పించాలిని వాల్మీకి ముదిరాజ్ పిల్లలను గొప్ప గొప్ప చదువులు చదివించాలన్నారు. సమాజంలో వాల్మీకి ముదిరాజ్ కులాలు అట్టడుగులు ఉన్నాయని తెలిపారు. ముదిరాజ్ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. మన జీవన విధానం నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల మన భవిష్యత్తుకు బాగుంటుందన్నారు రాజకీయాలకతీతంగా కులాలకు అతీతంగా స్వాతంత్రంగా సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి వాల్మీకి ముదిరాజ్ ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించి చెన్నకేశవ స్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ వరప్రసాద్, అన్నమయ్య, కడప జిల్లా నుంచి వాల్మీకి, ముదిరాజ్ సంఘం నాయకులు రామచంద్రయ్య, రామాంజనేయులు, విజయభాస్కర్, రాజేంద్ర బాబు, మూగి వెంకటరమణ, వాల్మీకి సేవాదళ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మూగి రెడ్డప్ప, విఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గువ్వల యోగానంద బాబు, రామసముద్రం దొడ్డిపల్లి సర్పంచ్ ఆనంద్, మానవ హక్కుల జిల్లా అవగాహన సదస్సు అధ్యక్షులు చలపతి, కృష్ణయ్య, సర్పంచు కేశవయ్య, శ్రీరాములు, రాజేష్, నారాయణ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పురపాలక పరిధిలోని సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. పురపాలక పరిధిలోని ఈడిగపాలెం, ఆర్.ఎస్.రోడ్డులోని సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కు సంబందించిన పలు రకాల సేవలను ఈ సచివాలయాలలో పొందవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఇంధన పొదుపు పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపోలో ఇంధన పొదుపు చేసిన ఇద్దరు డ్రైవర్లకు నగదు పురస్కారాలను అందజేసినట్లు పీలేరు డిపో మేనేజరు బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజిలో జరిగిన అభినందన సభకు ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అత్యధికంగా 86 లీటర్లు ఇంధన పొదుపు సాధించిన డ్రైవరు బి.లక్ష్మయ్య, 74 లీటర్లఉ ఇంధనం పొదుపు సాధించిన డ్రైవరు ఎస్ఎ హక్‌లకు ప్రథమ బహుమతిగా రూ.500, ద్వితీయ బహుమతిగా రూ.300 నగదు బహుమతులను ప్రధానం చేసి, మిగిలిన డ్రైవర్లు వీరిని ఆదర్శంగా తీసుకుని ఇంధన పొదుపులో జిల్లా స్థాయిలో పీలేరు డిపోను ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్యారేజి ఇంచార్జ్ హరి నాథరెడ్డి, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొని జయప్రదం చేశారు.

జ్ఞానాంబికా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో అన్నమయ్య జిల్లా నలుమూలల నుంచి పలువురు డిగ్రీ కళాశాల విద్యార్థినిలు సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జానపద నృత్య పోటీల్లో పాల్గొన్న జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు బంజారా డాన్స్‌లో ప్రథమ బహుమతి, జానపదాలు తెలుగులో ప్రతిభ చూపారని తెలిపారు.ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎస్. రమాదేవి, డాన్స్ మాస్టర్ సురేష్ అభినందించారు.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ

ప్రజాశక్తి -పుల్లంపేట

మండలంలోని సీతారాంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న ఉమ్మడి మీనా, వెంకటేష్ కుమారుడు ఉమ్మడి గగన్ కుమార్ జన్మదిన సందర్భంగా పాఠశాలకు ఫ్యాన్ వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాధవి మాట్లాడుతూ పాఠశాలలో ఆయాగా పనిచేసి వచ్చిన జీతంతో పాఠశాలకు వితరణగా ఫ్యాన్ ఇవ్వడం ఆయా దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామంలోని వారందరూ కూడా ఏదో ఒక విధంగా పాఠశాలకు సహకరిస్తున్నారని సహకరించాలని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

జీవవైవిద్యాన్ని సంరక్షించుకోవాలంటే ప్రకృతి వ్యవసాయ విధానం చేసుకోవాలని పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌బాబురావు పేర్కొన్నారు శుక్రవారం దిన్నెపాడు గ్రామం నరసింహారాజుగారిపల్లెలో దిన్నెపాటి రవిరాజు పొలంలో మామిడి ముక్కలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జీవవైవిద్యం నాశనం కాకుండా ఉండేటట్టు రైతుల వ్యవసాయ పద్ధతులు ఉండాలన్నారు పొలాలనులో దుక్కులు చేసి పెట్టుకోవాలన్నారు. భూసార పరీక్షలు ప్రత్యేక తప్పనిసరిగా చేయించాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో పంట సాగు అనంతరం భూసార పరీక్షలు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ దీన్నేపాటి రవిరాజు, మండల మాస్టర్ ట్రేనర్స్ సుబ్బరామయ్య, కాంతమ్మ, చంద్రమోహన్‌రెడ్డి, నాగార్జున, గంగిరెడ్డి, శాహీర్ బాషా, నాగమణి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు

అక్రమ ఇసుక రవాణా... అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె సమీపంలోని బహుధానదిలో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకను స్థానిక ప్రజలు అడ్డుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జిల్లా రైతు సంఘం నాయకులు గీతాల నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక క్వారీని రాజంపేట మండలంలోని మందరం చెయ్యేరు నది వద్ద సూచించగా ఇసుకాసురులు మాత్రం నందలూరు మండలంలోని నల్లతిమాయ్యపల్లి సమీపంలోని చెయ్యేరు నది వద్ద అక్రమంగా హిటాచిలు పెట్టి ఇసుక ఎత్తుతున్నారని ఆరోపించారు. ఈ విషయం విషయం తన దృష్టికి రావడంతో గ్రామస్తులతో వెళ్లి అడ్డుకోవడం జరిగిందన్నారు. నల్లతిమయ్యగారిపల్లె వద్ద ఇసుక ఎత్తడం వలన దాదాపు 300 ఎకరాలు పంట పొలాలకు సాగు నీటికి ఇబ్బంది తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి అధికారులు తక్షణమే వారి మీద చర్యలు తీసుకోని ప్రభుత్వం మంజూరు చేసిన క్వారీ దగ్గర మాత్రమే ఇసుక తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

శ్రీసౌమ్యనాథుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని మహారాష్ట్ర రత్నగిరి జిల్లా శివసేన మహిళా ఉపాధ్యక్షులు వందనా సావంత్, ఆమె భర్త ప్రముఖ వ్యాపారవేత్త వినోద్ సావంత్ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు సునీల్ శర్మ వారికి స్వామివారి దర్శన ఏర్పాట్లను కావించి, తీర్థ ప్రసాదాలను అందించి, ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా వినోద్ సావంత్ మాట్లాడుతూ సౌమ్యనాథ స్వామి ఆలయ విశిష్టత గురించి తెలుసుకొని ఆలయానికి విచ్చేసి 9 ప్రదక్షణలు చేసి తమ మొక్కులు తీర్చుకోవడం జరిగిందని అన్నారు. త్వరలో తిరిగి ఆలయానికి విచ్చేసి 108 ప్రదక్షిణలు చేస్తామని అన్నారు. ఆలయ విశిష్టతను మహారాష్ట్రలో తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శోభ, వివేక్ భక్తులు పాల్గొన్నారు.

మొబైల్ దుకాణం ప్రారంభం

రాయచోటి : పట్టణంలోని గాలివీడు రోడ్డు సాయి హాల్ వద్ద పాత రాయచోటికి చెందిన కొట్టే ప్రవీణ్ కుమార్ ఏర్పాటు చేసిన మోక్షిత్ మొబైల్ దుకాణాన్ని శుక్రవారం టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, లాయర్ సతీష్ రెడ్డి, మన్నేరు రామాంజనేయులు, రాజశేఖర్, బడిశెట్టి రవి, మండ్ల సతీష్ టిఎన్ఎస్ఎఫ్ శివ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు : ఎడిఎ

ప్రజాశక్తి - రామసముద్రం

ఆర్‌బికెల్లో నానో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ శ్రీకాంత్ అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై అందించాలన్నారు. టమోటా నర్సరీలు ద్వారా నాణ్యమైన నారు అందించాలని పేర్కొన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు కేశవరెడ్డి మాట్లాడుతూ ఆర్‌బికెల పరిధిలో సూక్ష్మ బిందు సేద్యం పరికరాలు కొరకు రైతులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మోహన్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి దివ్య, వైస్ ఎంపిపి రమణారెడ్డి, కన్వీనర్ భాస్కర్ గౌడు, సిహెచ్ ప్రకాశ్, తిమ్మయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ పోతువారిపల్లి, బాటవారిపల్లె, నీలప్పగారిపల్లి, కూచివారిపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి మార్గాలు వేస్తున్నట్లు తెలియజేశారు. పోతువారిపల్లి, నీలప్పగారిపల్లెల్లో పలగునీటి సమస్య ఉండడంతో వారికి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పైప్ లైన్ వేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. పలు పంచాయతీలలో విధి దీపాలు మరమ్మతై వెలగకపోవడంతో వాటిని వెంటనే మరమ్మతులు చేయించి, ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా మూవీ క్రియేషన్స్ సినిమా అడిషన్స్

ప్రజాశక్తి - రాయచోటి

మహా మూవీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మించబోయే చిత్రానికి ప్రీతం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అట్టహాసంగా ఆడిషన్స్ మొదలయ్యాయి. ఈ ఆడిషన్స్‌కు ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు సుగవాసిప్రసాద్ బాబు హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలనతో ఆడిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ వెండితెర పైకి రాయచోటి నుంచి యువ హీరోలు రావడం చాలా ఆనందదాయకమన్నారు. ఇప్పటికే రాయచోటి నుంచి కొంతమంది యువ హీరోలుగా వెండితెరపై ప్రేక్షకులను అలరిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. మహా మూవీ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు. హీరో ముజీబ్, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - రామసముద్రం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న తాగునీటి బోరు చాలా కాలంగా నిరుపయోగంగా ఉంది. కన్వీనర్ భాస్కర్ గౌడ్ చొరవతో తాగునీటి బోరు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కొరకు విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి బోరు మరమ్మత్తులు చేపట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో నిరుపయోగంగా ఉన్న బోర్లకు మరమ్మతులు నిర్వహించి ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

15 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సర్వే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు నిర్వహించే సర్వేపై వైద్య సిబ్బందికి శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ ఇచ్చినట్లు పిహెచ్‌సి డాక్టర్ జులేఖబేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తారీకు నుండి డిసెంబర్ నెల ఐదో తేదీ వరకు 21 రోజులు పాటు కుష్టు వ్యాధిగ్రస్తుల్ని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో 25 టీములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టీమ్‌లో ఆశాకార్యకర్త, వాలంటీరు, సంబంధిత ఏరియా ఏఎన్ఎం పర్యవేక్షకులుగా వుంటారన్నారు. మండలపరిధిలో ఏ ఒక్క అనుమానిత కుష్టు వ్యాధి కేసు వదలకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశాలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం కర్ణపు విశ్వనాథరెడ్డి చైర్మన్‌గా వైస్ చైర్మన్‌గా షేక్ షాజహాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తన వంతు కష్ట వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. నామీద ఎంతో నమ్మకంతో వుంచి నాకు ఈ పదవికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు గడికోట మోహన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ షాజహాన్, మార్కెటింగ్ ఎడి త్యాగరాజు, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి స్టేట్ వింగ్ జనరల్ సెక్రెటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



ఆత్మహత్య చేసుకున్న యువకుడు

ఉరేసుకుని యువకుడు అనుమానాస్పద మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని తట్టివారిపల్లి బైపాస్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మ ృతుని దగ్గర ఉన్న ఆధార్ ద్వారా మ ృతుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కైదీర్‌పూర్‌కు చెందిన పాపాయి సెరియన్ (21)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు తరలింపు

ప్రజాశక్తి- గాలివీడు

15 ద్విచక్ర వాహనాలను శుక్రవారం గాలివీడు పోలీసులు స్వాధీనం చేసుకుని అనంతపురానికి తరలించారు. నిందితుడు అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, గాలివీడు, ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు ఒకొక్కటి రూ.10 వేలకు విక్రయిస్తూ గాలివీడుకు వచ్చారు. ఇక్కడి పోలీసులు అతన్ని విచారించగా చోరీ చేసిన ద్విచక్రవాహనాలను అక్రమంగా ఇతరులకు రూ. 10 వేలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడానికి అనంతపురానికి తీసుకెళ్లారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు